పేదరికం-నిరుద్యోగం.. నివారణ చర్యలు


పేపర్-3, యూనిట్-3

పేదరికం-నిరుద్యోగం

Q స్వాతంత్ర్యానంతరం పేదరిక అంచనాలను వివరించండి?

A భారత్‌లో ఆర్థికాభివృద్ధి ప్రణాళికకు ఎదురవుతున్న ముఖ్య సవాళ్లు పేదరికం, నిరుద్యోగం. జీవన ప్రమాణం తక్కువగా ఉండటం, పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడే ప్రజలు ఎక్కువగా ఉండటం, నిరక్షరాస్యత, తక్కువ మానవాభివృద్ధి అనేవి అత్యధిక పేదరిక స్థాయికి పర్యాయ పదాలుగా భావించవచ్చు. రాజకీయ పార్టీలన్నీ పేదరిక నిర్మూలన అనే నినాదాన్ని వినిపిస్తుండటంతో ఇది జాతీయ లక్ష్యంగా ప్రాధాన్యం పొందింది. ఈ లక్ష్య సాధనకు పలు కార్యక్రమాలు రూపొందించి అమలు చేసినప్పటికీ.. పేదరిక నిర్మూలన విషయంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని భావించవచ్చు. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కనీస అవసరాలు కూడా పొందలేని పేదరిక స్థితిని 'నిరపేక్ష పేదరికం'గా చెప్పొచ్చు. అభివృద్ధి చెందిన దేశాల్లో మొదటి 5-10 శాతం వర్గాల ప్రజల ఆదాయం, వినియోగ వ్యయంతో పోల్చినపుడు చివరి 5-10 శాతం ప్రజల జీవన ప్రమాణం తక్కువగా ఉండటాన్ని బట్టి వారిని పేదలుగా నిర్ణయించడాన్ని 'సాపేక్ష పేదరికం' అంటారు.

స్వాతంత్ర్యానంతరం కొంత మంది పేదరిక అంచనాలను వ్యక్తిగతంగా రూపొందించారు. వీరిలో ఎక్కువ మంది 1960-61 ధరల వద్ద తలసరి వినియోగ వ్యయం నెలకు ₹ 20గా తీసుకొని అంచనా వేశారు. సెప్టెంబర్ 1989లో ప్రణాళికా సంఘం పేదరిక అంచనాలను రూపొందించడానికి లక్డావాలా అధ్యక్షతన ఒక నిపుణుల సంఘాన్ని నియమించింది. ఈ సంఘం అంచనాలను ప్రణాళికా సంఘం కొద్ది పాటి మార్పులతో అంగీకరించింది. 1973-74 నుంచి 1987-88 వరకు పేదరికం 54.9 శాతం నుంచి 38.9 శాతానికి.. తర్వాత కాలంలో 1987-88 నుంచి 1993-94 వరకు 38.9 శాతం నుంచి 36 శాతానికి తగ్గింది. నేషనల్ శాంపుల్ సర్వే 55వ రౌండ్ ఆధారంగా ప్రణాళికా సంఘ అంచనాల ప్రకారం పేదరికం 1999-2000 నాటికి 26.1 శాతానికి తగ్గింది. 1977- 78లో దారిద్ర్య రేఖ దిగువన నివసించే ప్రజలు 328.9 మిలియన్ల నుంచి 1999-2000 నాటికి 260.3 మిలియన్లకు తగ్గారని ప్రణాళికా సంఘం అంచనా వేసింది. డాటన్, డ్రిజ్ అభిప్రాయంలో 1970 నుంచి పేదరిక తగ్గుదల ప్రారంభమైంది. 1990 చివర్లో రాష్ట్రాల మధ్య వినియోగ వ్యయంలో అసమానతలు పెరిగాయని వీరు అభిప్రాయపడ్డారు. 1970 నుంచి పేదరిక స్థాయి తగ్గు ముఖం పట్టినప్పటికీ గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య , వివిధ రాష్ట్రాల మధ్య అసమానతలు పెరిగాయి. కేరళ, జమ్ము-కాశ్మీర్, గోవా, లక్షద్వీప్, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, అండమాన్ నికోబార్ దీవుల్లో పేదరికం తగ్గింది. వ్యవసాయ రంగంలో వృద్ధి పెరగడంతో పంజాబ్, హర్యానాలలో



పేదరికం తగ్గింది. కేరళలో మానవాభివృద్ధి పెంపునకు ప్రాధాన్యత, పశ్చిమ బెంగాల్‌లో భూసంస్కరణల అమలుతోపాటు పంచాయత్ రాజ్ సంస్థలకు సాధికారత, ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా అమలు చేయడం వంటి అంశాలు పేదరికం స్థాయి తగ్గుదలకు దోహదపడ్డాయి.

2004-05లో నేషనల్ శాంపుల్ సర్వే.. యూనిఫామ్ రీకాల్ పీరియడ్, మిక్స్‌డ్ రీకాల్ పీరియడ్ ప్రాతిపదికన పేదరికాన్ని అంచనా వేసింది. యూనిఫామ్ రీకాల్ పీరియడ్ ఆధారంగా దేశంలో 27.5 శాతం, మిక్స్‌డ్ రీకాల్ పీరియడ్ ప్రాతిపదికన 21.8 శాతం మంది ప్రజలు పేదరికంలో ఉన్నారు. 20 శాతం మంది ప్రజల రోజువారీ వినియోగ వ్యయం ₹14 కంటే తక్కువగా ఉందని సర్వే అభిప్రాయపడింది. నెలవారీ తలసరి వినియోగ వ్యయం ఆధారంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్‌లలోని గ్రామీణ ప్రజల్లో మిగతా రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రజల కంటే పేదరికం ఎక్కువ. ఇటీవల పేదరిక అంచనాల కోసం ఏర్పాటైన టెండూల్కర్ కమిటీ పేదరికాన్ని కొలవటానికి 'జీవన వ్యయం' అనే కొత్త ఫార్ములాను తీసుకుంది. ఈ కమిటీ అభిప్రాయంలో దేశంలో మొత్తం 42 కోట్ల ప్రజలు అంటే 37.2 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారు. ఈ కమిటీ అభిప్రాయంలో ఒడిశాలో 57.2 శాతం ప్రజలు దారిద్ర్య రేఖ దిగువన నివసిస్తుండగా తర్వాత బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో పేదరికం ఎక్కువగా ఉంది.

Q నిరుద్యోగిత అంచనాలను వివరించండి?

A అభివృద్ధి ప్రణాళిక ముఖ్యోద్దేశం ఆర్థిక వ్యవస్థలో అప్పటికే ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతోపాటు, శ్రామిక శక్తిలో అదనంగా భాగస్వామ్యం పొందేవారికి ఉపాధి కల్పించడం. భారత ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకున్న అధిక వృద్ధి.. శ్రామిక మార్కెట్‌లోని నిర్మాణాత్మక మార్పులకు కారణమైంది. దిగుమతి సుంకాల తగ్గింపు, పరిమాణాత్మక ఆంక్షలను తొలగించడం, చిన్నతరహా పరిశ్రమలకు రిజర్వేషన్ విధానం ఉపసంహరించుకోవడం వంటి విధానాలు శ్రమ సాంద్రత ప్రాధాన్యాన్ని పెంచాయి. తయారీ రంగానికి సంబంధించి శ్రమ సాంద్రత కలిగిన ఆహార ప్రాసెసింగ్, తోలు ఉత్పత్తులు, టెక్స్‌టైల్

ల్స్‌తోపాటు సేవారంగంలో, పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు పెంపొందించాలని 11వ పంచవర్ష ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో సంఘటిత రంగ ఉపాధి వృద్ధి 1994 నుంచి 2007 మధ్య కాలంలో తగ్గింది. 1983-84 మధ్య కాలంలో సంఘటిత రంగంలో ఉపాధి వృద్ధి 1.20 శాతం కాగా 1994-2007 మధ్య కాలంలో ఈ రంగంలో వృద్ధి రుణాత్మకం (-0.03 శాతం)గా ఉంది. సంఘటిత రంగంలో ఉపాధి వృద్ధి తగ్గుదలకు ప్రభుత్వ రంగంలో ఉపాధి వృద్ధి తగ్గుదల కారణమైంది. నేషనల్ శాంపుల్ సర్వే 61వ రౌండ్ ప్రకారం 2004-05లో అసంఘటిత రంగంలో మొత్తం ఉపాధి 457.5 మిలియన్లు కాగా వీరిలో శ్రామికులు 394.9 మిలియన్లు. అసంఘటిత కార్మికులలో సాంఘిక భద్రత, శ్రేయస్సు పెంపొందింపచేయడానికి 1948లో కనీస అవసరాల చట్టం, వర్క్‌మెన్స్ కాంపన్సేషన్ యాక్ట్ 1923, మెటర్నిటీ బెనిఫిట్ చట్టం 1961, బాండెడ్ లేబర్ అబాలిషన్ చట్టం 1976, బిల్డింగ్, ఇతర నిర్మాణ రంగ కార్మికులు చట్టం 1996 రూపొందించారు. నేషనల్ శాంపుల్ సర్వే అభిప్రాయంలో మొత్తం నిరుద్యోగితలో 62 శాతం గ్రామీణ రంగంలో ఉండగా 38 శాతం పట్టణ రంగంలో ఉంది.

నేషనల్ శాంపుల్ సర్వే నిరుద్యోగిత అంచనాలను మూడు విధాలుగా రూపొందించింది.

1. సాధారణ స్థితి నిరుద్యోగం
2. వారం వారీ స్థితి నిరుద్యోగం
3. రోజువారీ స్థితి నిరుద్యోగం

వారం వారీ, రోజు వారీ స్థితి నిరుద్యోగితా భావనలు రుతు సంబంధ, అల్ప ఉద్యోగిత, తాత్కాలిక నిరుద్యోగాన్ని అంచనా వేయడానికి ఉపకరిస్తాయి. నిరుద్యోగితను అంచనా వేయడానికి రోజువారీ స్థితి నిరుద్యోగితను ప్రాధాన్యతగల సూచికగా పేర్కొనవచ్చు. 2004-05 నేషనల్ శాంపుల్ సర్వే అధారంగా 8.2 శాతం గ్రామీణ ప్రజలు, 8.3 శాతం పట్టణ ప్రజలు రోజువారీ స్థితి నిరుద్యోగిత భావన ఆధారంగా నిరుద్యోగులు.

Q పేదరికం, నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాలను తెలపండి?

A స్వాతంత్ర్యానంతరం ప్రణాళికా యుగంలో పేదరికం, నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం అమలుచేసిన పథకాలను స్వయం ఉపాధి, వేతన ఉపాధి, ఏరియా స్పెసిఫిక్ (ప్రాంతాల వారి) పథకాలుగా పేర్కొనవచ్చు.

ఎ) ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి:

ఆదాయం, సంపద, అవకాశాల పరంగా సమాజంలో ఉన్న అసమానతలను పేదరికానికి కారణాలుగా పేర్కొనవచ్చు. స్వాతంత్ర్యానంతరం చేపట్టిన భూసంస్కరణలు, పురోగామి పన్ను విధానం అందరికీ సమాన అవకాశాలు కల్పించినందు వల్ల పేదరిక తీవ్రత తగ్గింది. వివిధ ప్రాంతాల్లోని అసమానతలు కూడా పేదరిక పెరుగుదలకు కారణమయ్యాయి. ప్రణాళిక ముఖ్య ఉద్దేశం ప్రాంతీయ అసమానతలు తొలగించడం. ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి పథకాలు ప్రాధాన్యం సంతరించుకుంటాయి. దుర్భిక్ష పీడిత ప్రాంతాల కార్యక్రమాన్ని 1973-74లో ప్రారంభించారు. వివిధ పంటల ఉత్పత్తి, ఉత్పాదకతపై కరువు ప్రభావాన్ని తగ్గించడం ఈ పథకం ధ్యేయం. ఈ కార్యక్రమం అమలు చేసే ప్రాంతాల్లో ఎటువంటి లబ్ధి పొందని, వనరుల కొరత ఎదుర్కొంటున్న వర్గాల ప్రజల్లో సాంఘిక, ఆర్థికాభివృద్ధి పెంపొందించడం ఈ పథకం లక్ష్యం. ప్రస్తుతం 16 రాష్ట్రాల్లోని 182 జిల్లాలకు సంబంధించిన 972 బ్లాక్‌లలో ఈ కార్యక్రమం అమల్లో ఉంది. ఈ కార్యక్రమానికయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో భరిస్తాయి.

ఎడారి ప్రాంత అభివృద్ధి కార్యక్రమాన్ని రాజస్థాన్, గుజరాత్, హర్యానాలలో, శీతల ఎడారి ప్రాంతాలైన జమ్ము-కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో 1977-78లో ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో ఈ కార్యక్రమం కొంత సత్ఫలితాలనిచ్చినప్పటికీ దేశం మొత్తం మీద ఈ కార్యక్రమానికి సంబంధించి గుర్తించిన ప్రాంతాల్లో అంతగా విజయవంతం కాలేకపోయింది. ప్రాంతాల అభివృద్ధిని వాటర్‌షెడ్ ప్రాతిపదికన చేపట్టకపోవడం, ప్రణాళిక రూపకల్పన, అమల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యం లేకపోవడం ఈ కార్యక్రమం వైఫల్యానికి కారణమని సీహెచ్ హనుమంత రావు కమిటీ అభిప్రాయపడింది. వీటితోపాటు నిధుల కొరత, శిక్షణ పొందిన వ్యక్తులు తక్కువగా ఉండటం కారణంగా ఈ పథకం విఫలమైంది. ప్రస్తుతం ఈ కార్యక్రమం 7 రాష్ట్రాల్లో 40 జిల్లాల్లోని 235 బ్లాక్‌లలో అమల్లో ఉంది. ఈ కార్యక్రమానికయ్యే వ్యయాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. హాట్ ఎరిడ్ ప్రాంతాల్లో మాత్రం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో వ్యయాన్ని భరిస్తాయి.

బి) స్వయం ఉపాధి పథకాలు:

పేదరికం, నిరుద్యోగ నిర్మూలనకు ప్రణాళికా యుగంలో అనేక స్వయం ఉపాధి కార్యక్రమాలు రూపొందించారు. 6వ ప్రణాళికలో ఐఆర్‌డీపీ, ట్రైసమ్, డ్వాక్రా కార్యక్రమాలు ప్రారంభించగా 8వ ప్రణాళికలో ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేశారు. ఐఆర్‌డీపీ దాని అనుబంధ కార్యక్రమాలైన ట్రైసమ్, డ్వాక్రా, గంగా కళ్యాణ్ యోజన, పది లక్షల బావుల పథకం, చేతి వృత్తుల వారికి టూల్ కిట్స్ పంపిణీ లాంటి స్వయం ఉపాధి పథకాలన్నిటినీ విలీనం చేస్తూ 1999 ఏప్రిల్ 1 నుంచి 'స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ధ్యేయం.

గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలు ఈ కార్యక్రమం లక్షిత గ్రూపులుగా ఉంటాయి. లక్షిత గ్రూపుల్లోని అణగారిన వర్గాల వారికి ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఈ కార్యక్రమం ద్వారా కలిగే 50శాతం లబ్ధిని, మహిళలకు 40శాతం, అంగవి

కులురకు (డిజేబుల్డ్ పర్సన్స్) 3 శాతాన్ని రిజర్వ్ చేశారు. పేద వర్గాల వారిని 'స్వయం సహాయక బృందాల' ఏర్పాటుకు ప్రోత్సహించి శిక్షణ, పరపతి, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తూ స్వయం ఉపాధిని ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమం కృషి చేస్తుంది.

సి) వేతన ఉపాధి పథకాలు:

ప్రణాళికా యుగంలో పేదరికం, నిరుద్యోగ నిర్మూలనకు వేతన ఉపాధి పథకాలు ప్రారంభించారు. 6వ ప్రణాళికలో ఎన్ఆర్ఈపీ, ఆర్ఎల్ఈజీపీ, 7వ ప్రణాళికలో జవహర్ రోజ్‌గార్ యోజన, నెహ్రూ రోజ్‌గార్ యోజన, 8వ ప్రణాళికలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. పట్టణ ప్రాంతాలకు సంబంధించిన వేతన ఉపాధి పథకాలను విలీనం చేస్తూ 1997లో 'స్వర్ణ జయంతి షహరీ రోజ్‌గార్ యోజన' ప్రారంభించారు. ఎన్ఆర్ఈపీ, ఆర్ఎల్ఈజీపీలను జవహర్ రోజ్‌గార్ యోజన కార్యక్రమంలో విలీనం చేశారు. జవహర్ రోజ్‌గార్ యోజనను జవహర్ గ్రామ సమృద్ధి యోజన(జేజీఎస్‌వై)గా పేరు మార్చి, ఉపాధి హామీ పథకం (ఈఏఎస్)తో పాటు ఈ రెండు కార్యక్రమాలను విలీనం చేస్తూ 'సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన' 2001లో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కూడా ప్రస్తుతం అమల్లో ఉన్న 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం'లో విలీనం చేశారు.

ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్:

1.పేదరిక భావనను వివరించి స్వాతంత్ర్యానంతరం పేదరిక అంచనాలు తెలపండి?

2.నిరుద్యోగిత అంచనాలను వివరించండి?

3.పేదరికం, నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలను తెలపండి?

4.పేదరికం, ఆర్థికాభివృద్ధి మధ్య సంబంధాన్ని వివరించండి?

5.మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వివరించండి?

6.పేదరికం, నిరుద్యోగ నిర్మూలనకు దీర్ఘకాల చర్యలను తెలపండి?

ప్రీవియస్ కొశ్చన్స్:

1.పేదరికాన్ని కొలిచే పద్ధతులను వివరించండి?

2.నిరుద్యోగాన్ని అంచనా వేసే పద్ధతులు వివరించండి?